క్లుప్తంగా

విద్య, వైద్యానికి పెద్దపీట

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మరుపూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాటగొట్లలో మంగళవారం మంత్రి కాకాణి పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరుపూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. చాటగొట్ల తనకు సొంతూరితో సమామన్నారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు ఇళ్ల ప్లాట్లు అందజేయడంతో పాటు తొలివిడతగా రూ.1.05 కోట్లతో సీసీరోడ్లు, రూ.40 లక్షలతో సైడ్‌డ్రెయిన్లు, రూ.63 లక్షలతో తాగునీటి ట్యాంకు, పైపులైన్లు, గడప గడపకు మన ప్రభుత్వంలో సీసీరోడ్లకు రూ.60 లక్షలు, నాడు–నేడు పథకంలో రూ.24 లక్షలు మొత్తం రూ.3 కోట్లను అభివృద్ధి పనులకు వెచ్చించినట్లు తెలిపారు. ఎస్టీల ఇళ్లనిర్మాణం కోసం రూ.1.80 లక్షలతో పాటు అదనంగా తాను రూ.15 వేలు అందజేశానని, స్థానిక నేత పెంచలయ్య తన చేతిడబ్బులు పెట్టి వారికి చక్కటి పక్కా ఇళ్లను నిర్మించి అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, సర్పంచ్ చంద్రకళ, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ పాల్గొన్నారు.

అలీకి సన్మానం



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో మంగళవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చేసిన ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు అలీని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా నేత ఎండీ.కరిముల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు.

ఘనంగా శోభా యాత్ర



మనుబోలు : మండల కేంద్రంలో హిందూ ధార్మిక సమ్మేళనంలో భాగంగా సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం నుంచి ప్రారంభమైన అంబేడ్కర్ విగ్రహం మీదుగా గ్రామంలోని వీధులన్నీ తిరుగుతూ శివాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆ సమితి మండల కోఆర్డినేటర్ ఆలూరు రాము మాట్లాడారు. హిందువులంతా ఐక్యంగా ఉంటూ దేశ సమగ్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు సంఘీభావం ప్రకటించారు. ఎస్‌ఎస్‌ఎఫ్ రాపూరు డివిజన్ కోఆర్డినేటర్ గణపతి, ఆధ్యాత్మికవేత్త మనోహర్‌హింద్, గీతాశ్రమ స్వామిజీ ప్రణవాత్మానంద, సర్పంచ్ పద్మమ్మ, బీజేపీ నేతలు బోలా శ్రీనివాసులు, ఓడూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం వెంకటాచలానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయానికి చేరుకుని విద్యార్థులకు ట్యాబ్‌లు, లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

మనుబోలులో

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం మనుబోలుకు రానున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులకు ట్యాబ్‌లు, కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తారు. అలాగే బీసీకాలనీలో కొత్తగా నిర్మించిన డ్రెయిన్లను ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ నేత గుంజి రమేష్ మంగళవారం తెలిపారు.

కసుమూరు ఆలయాల్లో చోరీ

వెంకటాచలం : మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలో మాతమ్మ, పుట్టాలమ్మ ఆలయాల్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మాతమ్మ ఆలయంలో హుండీని, పుట్టాలమ్మ ఆలయంలో హుండీతో పాటు అమ్మవారి ముక్కు పుడకను అపహరించుకుని వెళ్లారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు



సభా ప్రాంగణానికి తరలివస్తున్న జనసందోహం

సాధికార జైత్రయాత్ర



• పులకించిన నార్తురాజుపాళెం

సామాజిక సాధికార బస్సు యాత్రతో కోవూరు నియోజకవర్గంలోని నార్తురాజుపాళెం పులకించింది. వేలాదిగా తరలివచ్చిన జనసందోహంతో స్థానిక వైఎస్సార్ కూడలి కిక్కిరిసింది. అటు రాజ్యాధికారం నుంచి ఇటు సంక్షేమ పథకాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రజాప్రతినిధులు వివరిస్తుంటే సభకు విచ్చేసిన ప్రజలు హర్షధ్వానాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి జేజేలు పలికారు. తమకు అన్నివిధాలుగా మేలు చేసిన జగనన్నకే మద్దతు తెలుపుతామని ప్రజలందరూ ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. – సాక్షి నెట్‌వర్క్



దివంగత సీఎం వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, తదితరులు



నార్తురాజుపాళెంలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, చిత్రంలో అలీ, ఎమ్మెల్యే ప్రసన్న



సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొన్న ప్రజలు



సభా కార్యక్రమాన్ని మేడపై నుంచి తిలకిస్తున్న యువత



అశ్వాలపై అభిమానుల సందడి



జైత్రయాత్ర కోసం వేచిఉన్న మహిళలు

చంద్రబాబును ప్రజలు నమ్మరు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : చంద్రబాబు దొంగ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, పవన్‌కల్యాణ్ టీడీపీకు అమ్ముడుపోయి జనసైనికులను హోల్‌సేల్‌గా అమ్మేశాడని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలం చాటగొట్ల, దుగ్గుంట పంచాయతీల్లో రూ.కోట్లాది అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబును రాష్ట్ర ప్రజలు చాలా ఏళ్లు సీఎంగా చూశారని, అయినా గుర్తించుకునే పథకం ఒక్కటైనా అమలు చేశాడానని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల వద్ద బాబుకే షూరిటీ లేదని, ఆయన మాత్రం 'బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' పేరుతో పగటి వేషగాళ్ల మాదిరి గ్రామాల్లో తిరుగుతున్నట్లు విమర్శించారు. పవన్‌కల్యాణ్‌ను జనసైనికులు ముఖ్యమంత్రిగా చూడాలని భావిస్తే ఆయన మాత్రం తన పార్టీని బాబుకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు.

గ్రామాల్లో రూ.కోట్లాది అభివృద్ధి

సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.కోట్లాది అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు మంత్రి కాకాణి పేర్కొన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అందుకనే ఈ నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యేగా, మంత్రిగా 15 ఏళ్ల మేరకు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. దుగ్గుంట పంచాయతీలో నాడు–నేడు, నుడా కింద సీసీరోడ్లు, డ్రెయిన్లు, జలకళ బోర్లు తదితర అభివృద్ధి పనులకు రూ.6.77 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. తొలుత పొదలకూరు నుంచి దుగ్గుంట వరకు కార్లు, బైకుల ర్యాలీ నిర్వహించి మంత్రికి ఘనస్వాగతం పలికారు. తహసీల్దార్ కె.వీరవసంతరావు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, పార్టీ నేతలు రమణారెడ్డి, చినబ్రహ్మయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి, సర్పంచులు చంద్రకళ, కె.వెంకటరమణయ్య, నేతలు ఎస్.పెంచలయ్య, విజయభాస్కర్, వి.శ్రీనివాసులురెడ్డి, ఎం.శివశంకర్, డి.విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.పెంచలనాయుడు, చంద్రయ్య, సుందరయ్య పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న మంత్రి కాకాణి

అవగాహన కల్పించాలి

ఇందుకూరుపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మండలంలోని పున్నూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ఈ సంకల్ప యాత్రను అన్నిశాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలన్నారు. అనంతరం కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. కేంద్ర పథకాల గురించి డిజిటల్ స్క్రీన్‌పై ప్రజలకు వివరిస్తున్నామని ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేంద్రబాబు తెలిపారు. తహసీల్దార్ సుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలను మంగళవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. గోవింద నామస్మరణతో దేవస్థానం మారుమోగింది. ఉభయకర్తలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

• ఘనంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఊరూ.. వాడా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. యువత, పెద్దలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని, క్రీడా ప్రతిభను కనబరిచారు. దీంతో ప్రతి గ్రామంలో కోలాహలం నెలకొంది.

ముత్తుకూరు : మండల కేంద్రమైన ముత్తుకూరులో ఉన్న ఫిషరీస్ కళాశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఎంపీపీ గండవరం సుగుణ ప్రారంభించారు. సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఉపసర్పంచ్ అనితారెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణకుమార్, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు మొత్తం ఏడు మైదానాలను ఎంపిక చేశారు. దమ్మాయపాళెం, ఎంపీపాళెం, ఈపూరు వెంకనపాళెం, బ్రహ్మదేవి, ముత్తుకూరు జెడ్పీ హైస్కూళ్లు, గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో క్రికెట్ పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

అట్టహాసంగా..

వెంకటాచలం : వెంకటాచలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తూ ఆడుదాం ఆంధ్రా పేరిట ఆటల పోటీలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఎంపీడీఓ ముజీబున్నీసా, జెడ్పీటీసీ పాట్లూరు సుబ్రహ్మణ్యం, చీకుర్తి నరసయ్య, నరేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుగుణమ్మ

క్రీడాస్ఫూర్తితో ఆడాలి

మనుబోలు : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కొనసాగిస్తూ ఆటలాడాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో వివిధ క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. మండలంలోని 14 సచివాలయల పరిధిలో 124 టీమ్‌లు 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో మంగళవారం 57 మంది టీమ్‌లు క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ పోటీలు జరుగుతున్న మైదానాల్లో క్రీడాకారుల కోసం తాగునీరు, స్నాక్స్, అరటిపండ్లు ఏర్పాటు చేశామన్నారు.

ఆర్డీఓ పరిశీలన

మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను మంగళవారం ఆర్డీఓ మలోల పరిశీలించారు. యువత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు. అనంతరం కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీంధర్‌రెడ్డి, మహేంద్రవర్మ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనుమాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• **పొదలకూరు** : మండలంలోని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను మంగళవారం ప్రారంభించారు. పొదలకూరులో సచివాలయం బిట్–1, 2, 3లకు సంబంధించిన పోటీలను స్థానిక డీఎన్నార్ జెడ్పీహైస్కూల్లో మండల ప్రత్యేకాధికారి శోభన్‌బాబు ప్రారంభించారు. క్రీడా పరికరాలను అందజేశారు. ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ బాలకృష్ణయ్య పాల్గొన్నారు. ఇనుకుర్తి సచివాలయానికి సంబంధించి జెడ్పీహైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పోటీలను సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి ప్రారంభించారు. తొలిరోజు బాల్‌బ్యాడ్మింటన్ వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు.

క్రీడా నైపుణ్యాలు గుర్తించడమే లక్ష్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని డీఎల్‌ఎన్నార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ప్రారంభమైంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఏడీ సోమయ్య, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోలాహలం

ఇందుకూరుపేట : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు మండలంలో కోలాహలంగా మొదలైంది. గంగపట్నంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, ఫణీంద్రనాయుడు, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

• ఇందుకూరుపేట ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి శోభన్‌బాబు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: క్రీడా కిట్ల అందజేత



ఇందుకూరుపేటలో పోటీలు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



వెంకటాచలం: పోటీలను ప్రారంభిస్తున్న వెంకటశేషయ్య



వెంకటాచలం: క్రీడల్లో పాల్గొన్న యువకులు



మనుబోలు : బ్యాటింగ్ చేస్తున్న ఆర్డీఓ మలోల